# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 15 జనవరి 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 142

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD







## వ్యక్తిత్వ హననం జరిగితే సహించం



**వ్యక్తులు, కుటుంబాలపై తప్పుడు వార్తలు సరికాదు**

**మహిళా ఐఎఎస్ కేసుపై డిజిపి శివధర్ రెడ్డి స్పందన**

హైదరాబాద్: చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి హెచ్చరించారు. మహిళా ఐఏఎస్ అధికారి గౌరవానికి భంగం కలిగించేలా ఓ టీవీ ఛానల్, యూట్యూబ్ ఛానళ్లలో కథనాలు ప్రసారమైన నేపథ్యంలో డీజీపీ స్పందించారు. 'సోషల్ మీడియా అత్యుత్సాహంపై గతంలోనే హెచ్చరించాం. సోషల్ మీడియా పేరుతో వ్యక్తిత్వ హననం చేస్తే చర్యలు తప్పవు. వ్యక్తులు, కుటుంబాల గురించి తప్పుడు వార్తలు వేయవద్దు. వ్యక్తిగత అంశాలపై ఫేక్ న్యూస్ ప్రచారం చేయకూడదని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననంపై డీజీపీ శివధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలోనే తమ విధానాన్ని వెల్లడించినట్లు గుర్తు చేశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అక్టోబర్ ఒకటో తేదీన జరిగిన విలేకరుల సమావేశంలో.. సోషల్ మీడియా వినియోగంపై మార్గనిర్దేశర చేస్తూ, చట్ట పరిమితులను దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశానని పేర్కొన్నారు. సోషల్ మీడియా పేరుతో ఎవరైనా వ్యక్తిత్వ హననం చేయడం, ఇతరుల శీలానికి భంగం కలిగించడం, క్యారెక్టర్ అసాసినేషన్‌కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తమ విధానంగా తెలియజేశానన్నారు. అలాగే ఇతర వ్యక్తుల గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, అసత్య ఆరోపణలు చేయడం, ఫేక్ న్యూస్‌ను సర్కులేట్ చేసి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవడం అనుమతించబోమని మరోమారు స్పష్టం చేశారు. చట్టానికి లోబడి, నిర్మాణాత్మక విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని డిజిపి అన్నారు .అయితే ఆ పరిమితులను దాటి, సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ అబద్ధాలు ప్రచారం చేస్తే మాత్రం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కాళేశ్వరం మూడో టీఎంసీ పనులు వినియోగించుకుందాం

**తుమ్మిడిహెట్టి-సుందిళ్ల అనుసంధానంతో బహుళ ప్రయోజనాలు**

**హైదరాబాద్‌కు వాటర్‌గ్రిడ్.. మల్లన్నసాగర్‌లో నీటి నిల్వపై దృష్టి**

**బృహత్తర ప్రణాళిక దిశగా అడుగులు**

**నీటిపారుదల శాఖకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం**



హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల్లో భాగంగా మూడో టీఎంసీ కోసం చేపట్టిన పనులను వినియోగించుకోవడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. గోదావరి నుంచి మేడిగడ్డ ద్వారా మిడ్‌మానేరు వరకు మొదట రోజుకు రెండు టీఎంసీల నీటిని తరలించేలా గత ప్రభుత్వం నిర్మాణాలు చేసింది. తదుపరి మరో టీఎంసీ కూడా తరలించేలా పనులు చేపట్టింది. మూడో టీఎంసీకి దాదాపు రూ.34 వేల కోట్ల అంచనాలతో నిర్మాణాలు చేపట్టగా.. సుమారు రూ.18,000 కోట్ల పనులు పూర్తయ్యాయి. ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పనులను.. ప్రస్తుతం తిరిగి వినియోగంలోకి తేవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్లకు ఎత్తిపోయడానికి ప్రభుత్వం డీపీఆర్ రూపకల్పనకు ఉత్తర్వులు జారీచేసింది. అయితే సుందిళ్లకు వచ్చే ఈ జలాలను ఎల్లంపల్లి, మధ్యమానేరు ద్వారా మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు వేగంగా తరలించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఈ క్రమంలో గతంలో చేపట్టిన మూడో టీఎంసీ పనులను వినియోగంలోకి తేవాలని ఆలోచన చేస్తోంది. ఇప్పటికే చేసిన ఖర్చు ఎంత? పూర్తిస్థాయిలో పనులు అందుబాటులోకి రావాలంటే ఇంకా ఎంత ఖర్చు పెట్టాలి? అనే దానిపై పూర్తిస్థాయి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా నీటి పారుదల శాఖను ఆదేశించినట్లు తెలిసింది.

**రాజధాని అవసరాలు తీర్చేలా..**

హైదరాబాద్ నగరం విస్తరిస్తుండగా.. పారిశ్రామిక, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం భవిష్యత్తు ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే మల్లన్నసాగర్ నుంచి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లకు నీటిని తరలించేందుకు పనులు చేపడుతున్నారు. దీంతోపాటు హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న మల్లన్నసాగర్‌లో పెద్దఎత్తున నీటి నిల్వకు అవకాశం ఉండడంతో దాన్ని ఎందుకు వినియోగించుకోవద్దనే ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్లకు.. అక్కడి నుంచి మల్లన్నసాగర్‌కు నీటిని సరఫరా చేసి.. భవిష్యత్తు అవసరాలకు నీటి నిల్వలు ఉండేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని భావిస్తోంది. హైదరాబాద్ నగరానికి పవర్ గ్రిడ్ మాదిరి.. వాటర్ గ్రిడ్ ఒకటి ఉంటే బాగుంటుందని సీఎం సూచించినట్లు తెలిసింది. మూడో టీఎంసీ పనులు.. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ జలాశయాల్లో నీటినిల్వకు ఉన్న అవకాశాలు.. హైదరాబాద్‌కు ఆ నీటి తరలింపు.. వీటన్నింటిపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి.. నీటిపారుదలశాఖను ఆదేశించినట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా వాటర్ గ్రిడ్‌కు సంబంధించి ప్రతిపాదనలతో రావాలని నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాను సీఎం ఆదేశించినట్లు తెలిసింది.

**పునరుద్ధరణ సరిగా చేయకుంటే ప్రభుత్వానికి తలపోటు**

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులు చక్కగా చేయకుంటే.. ప్రభుత్వానికి తలనొప్పి వచ్చే అవకాశాలు ఉంటాయని సీఎం అభిప్రాయపడినట్లు తెలిసింది. భారాస ప్రభుత్వంలో 2023లో కుంగుబాటు, ఇతర లోపాలతో బయటపడ్డ 3 బ్యారేజీలను జాగ్రత్తగా వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నట్లు సమాచారం.



## ఎపిలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు

తెలుగు రాష్టాల్లో సంక్రాంతి సందడి

భారీగా తరలిచ్చిన తెలుగు రాష్ట్రాల వీక్షకులు

ఎల్ఇడి స్ర్కీన్‌లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు

ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర నేతల రాకతో హడావిడి




## రిజిస్ట్రేషన్ రుసుము .. తీగ లాగితే.. కదులుతున్న డొంక...!

**హైదరాబాద్:** ధరణి పోర్టల్ ప్రారంభం నుంచి ఎన్ని లావాదేవీల్లో ఇలాంటి పొరపాట్లు జరిగి ఉంటాయనే దానిపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రూ.వందల కోట్ల విలువైన భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో మాత్రం రుసుం మొత్తంలో నామమాత్రంగా 1శాతం చెల్లించినా లావాదేవీలు పూర్తయ్యాయి. సాఫ్ట్‌వేర్‌లో లోపాలు ఉంటే... దస్త్రాలను ప్రత్యక్షంగా పరిశీలించాల్సిన తహసీల్దారులు/సంయుక్త సబ్ రిజిస్ట్రార్లు మిన్నకున్నారు. 2020లో ప్రైవేటు సంస్థ ద్వారా ప్రారంభమైన ధరణి నుంచి ప్రస్తుత భూభారతి వరకు... అనేక సాంకేతిక లోపాలు కనిపించడం గమనార్హం. జనగామలో వెలుగుచూసిన సాగు భూముల రిజిస్ట్రేషన్ ఈ-చలానా చెల్లింపుల్లో మోసం వ్యవహారంలో రోజురోజుకు అనేక కొత్త విషయాలు బహిర్గతం

- మిగతా 2వ పేజీలో

## అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ దారుణం



**రాష్ట్రంలో ఎమర్జెన్సీ తలపిస్తున్న కాంగ్రెస్ పాలన**

**అరెస్టులను ఖండించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్




## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

**29మంది మావోల లొంగుబాటు**

## పడిపోయిన టమోటా ధరలు

**మదనపల్లె మార్కెట్‌లో కిలో 25కే విక్రయం**



## జర్నలిస్టుల అరెస్టు దారుణం

**విచారణ జరిగే లోపే అరెస్టులు ఎందుకు**

**రేవంత్ రెడ్డిలో భయం నాటుకుందేమో**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



## శబరిగిరులపై మకరజ్యోతి దర్శనం

**మార్మోగిన స్వామి శరణం నామస్మరణం**

**పులకించిపోయిన అయ్యప్ప భక్తులు**



వేగుచుక్క

## జర్నలిస్టుల అరెస్టు దారుణం

హైదరాబాద్: తెలంగాణలో జర్నలిస్టుల అక్రమ అరెస్టుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభమైన జర్నలిజం పట్ల, జర్నలిస్టుల పట్ల తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనైతికమని తెలిపారు. ఓ న్యూస్ రిపోర్ట్ విషయంలో తలెత్తిన వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 8 మంది సభ్యుల స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ ఇంకా విచారణ జరుపుతూనే ఉందని.. ఇంతలోపే రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరించి, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే జర్నలిస్టుల ఇళ్లపై దాడి చేసి, ఇంటి తలుపులు ధ్వంసం చేసి వారిని అరెస్టు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. విచారణ పూర్తయ్యాక, తప్పొప్పులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి. కానీ.. ఇలా ముందుగానే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నమ్మకం లేదా? లేక కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారా? అని నిలదీశారు. అక్రమంగా అరెస్టు చేసిన జర్నలిస్టులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిష్పక్షపాతంగా సిట్‌తో విచారణ జరిపించాలి. అంతే తప్ప జర్నలిస్టులను బెదిరించే, భయపెట్టే చర్యలకు పాల్పడకూడదని డిమాండ్ చేశారు.

## శబరిగిరులపై మకరజ్యోతి దర్శనం

తిరువనంతపురం: శబరిగిరులపై మకర జ్యోతి దర్శనమిచ్చింది. దాంతో స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణల మధ్య మకర జ్యోతిని అయ్యప్ప మాలధారణలో ఉన్న స్వాములు భక్తి తన్మయత్వంతో దర్శించుకున్నారు. జనవరి 14వ తేదీ మకర సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల మధ్య మకర జ్యోతి దర్శనమిచ్చింది. అయితే ఈ సారి మకరవిలక్కు ఉత్సవాలకు వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు.

కేరళ హైకోర్టు ఆదేశాలతో దర్శన కోటాపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దాంతో పోలీసులు పక్కాగా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ మకర దర్శనం కోసం సన్నిధానం, పంబ, శబరిమల కొండ, నీలిమల ప్రాంతాలు అయ్యప్ప స్వాములతో కిక్కిరిసిపోయాయి. దాంతో బుధవారం ఉదయం 10గంటల తర్వాత పంబ నుంచి సన్నిధానానికి భక్తులను అనుమతించ లేదని సమాచారం. పంచగిరులు.. నీలిమల, కరిమల, శబరిమల, అప్పాచిమేడు, అలుదామేడు ప్రాంతాల్లో ఈ దివ్య జ్యోతి దర్శనం స్పష్టంగా కనిపించింది. దాంతో ఆయా ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. శబరిమలలో సంక్రాంతి పండగ వేళ.. పంచగిరులపై మకరవిలక్కు (మకర జ్యోతి)గా అయ్యప్ప స్వామి వారు దర్శనమిస్తారని భక్తులు ప్రగాఢ విశ్వాసం. గత కొన్ని శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది. దాంతో లక్షలాది మంది భక్తులు శబరిమలకు మకర సంక్రాంతి వేళ.. తరలివస్తారు. మరోవైపు ఈ రోజు అంటే.. బుధవారం మధ్యాహ్నం 3.13 గంటల నుంచి మకర సంక్రాంతి పుణ్యకాలం ప్రారంభమైంది. దీంతో స్వామివారికి మేల్ శాంతుల పేరిట తంత్రిలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఇక జనవరి 12వ తేదీన పందళం రాజప్రసాదం నుంచి బయలుదేరిన స్వామివారి ఆభరణాలు ఈ రోజు సాయంత్రం 5.20 గంటలకు స్వామివారి సన్నిధికి చేరుకున్నాయి. వాటిని స్వామివారికి అలంకరించి.. మహదీపారాధన నిర్వహించారు. ఈ దీపారాధన అనంతరం పొన్నంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు దర్శనమిచ్చింది. అంటే సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల వరకు అంటే పావుగంట మధ్య మూడుసార్లు స్వామివారు దీప రూపంలో దర్శనమిచ్చారు. జనవరి 19వ తేదీ వరకు స్వామివారి దర్శనం కొనసాగనుంది. ఆ మరునాడు అంటే జనవరి 20వ తేదీ ఆలయాన్ని మూసివేయనున్నారు.?

## అర్థరాత్రి జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

హైదరాబాద్: సంక్రాంతి పండుగవేళ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. తెలంగాణలో ఈ కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. మీరు ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు.

అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్ధరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని తాను డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు. అసలు ఈ విషయాన్ని లీక్ చేసింది ఎవరు..? మిస్టర్ 30 పర్సెంట్ సపోర్టు లేకుండా ప్రభుత్వ అనుకూల టీవీ ఛానెల్ ఈ అంశాన్ని ప్రసారం చేసిందని మీరు భావిస్తున్నారా..? అని ప్రశ్నించారు.

## ఉద్యోగుల ఖాతాల్లో బకాయిల నగదు జమ

అమరావతి: సంక్రాంతి పండగ వేళ ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం బుధవారం చెల్లించింది. దీంతో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగుల ఖాతాల్లో భారీగా నగదు జమవుతోంది. దాంతో ఆయా ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. సంక్రాంతి పండగవేళ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసులకు డీఏ, డీఆర్ ఎరియర్లు, సరెండర్ లీవులతోపాటు కాంట్రాక్టర్లకు పెండింగులో ఉన్న బిల్లులు జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దాంతో భోగి పండుగ రోజు ఈ నగదు బకాయిలు చెల్లించింది. నగదు ఖాతాల్లో జమ కావడంతో వారంతా ఆనందంలో ఉన్నారు. డీఏ, డీఆర్ఏ ఎరియర్స్ నిమిత్తం ఒక్కో ఉద్యోగి, పోలీసుల ఖాతాల్లో రూ.70 నుంచి రూ.80 వేల వరకు నగదు జమ అవుతుంది. పండగ పూట డీఏ, డీఆర్ఏ బకాయిలు జమ కావడంతో ఉద్యోగులతోపాటు రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలు ఆనందంలో మునిగిపోయాయి. సుమారు 5.70 లక్షల మంది ఖాతాల్లో ఈ నిధులను ఆర్థిక శాఖ జమ చేస్తోంది. ప్రభుత్వానికి, సీఎంకు ఉద్యోగ సంఘాలు సైతం కృతజ్ఞతలు తెలియజేశాయి. ఈ నిధుల జమపై ఏపీ

పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు స్పందించారు. పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవులు, డీఏ ఎరియర్లను ప్రభుత్వం విడుదల చేసిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈసారి సంక్రాంతి పండుగను తామందరం చాలా సంతోషంగా జరుపుకుంటామని చెప్పారు. గతంలో సీఎం చంద్రబాబును కలిసి సరెండర్ లీవులకు సంబంధించిన నగదు విడుదల చేయాలని కోరగా.. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని గుర్తు చేశారు. తమకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నిధులు విడుదల చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు పోలీసులు అందరి తరఫున కృతజ్ఞతలతోపాటు సంక్రాంతి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు ఏపీ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

### 29మంది మావోల లొంగుబాటు



రాయపూర్: మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లా గోగుండ ప్రాంతానికి చెందిన 29 మంది మావోయిస్టులు బుధవారం పోలీసుల సమక్షంలో లొంగిపోయారు. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘం (డీఏకేఎమ్ఎస్) నేత పొడియం బుద్రాతో పాటు డీఏకేఎమ్ఎస్, జనత సర్కార్ వింగ్ వర్గాలతో పాటు ఇతర మావోయిస్టులు పోలీసులు ముందు లొంగిపోయారు. తమ ఆయుధాలను సరెండర్ చేశారు. పొడియం బుద్రాపై రూ.2 లక్షల రివార్డు ఉంది. మావోయిస్టుల పునరావాసం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా అనేక మంది మావోయిస్టులు ఆయుధాలను త్యజించి జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని చెప్పారు. నక్సలిజంను వీడి సామాన్య జనజీవనాన్ని అవలంబించాలని ఈ సందర్భంగా ఇతర మావోలకు ఆయన పిలుపునిచ్చారు. కొంతకాలంగా మావోయిస్టుల లొంగుబాట్లు కొనసాగుతుండటంతో గోగుండ ప్రాంతంలో (దర్భా డివిజన్) ఉద్యమ ప్రాబల్యం మరింతగా తగ్గినట్లైంది. గోగుండలో సెక్యూరిటీ క్యాంపు ఏర్పాటుతో మావోయిస్టుల కార్యకలాపాలు చాలా వరకూ తగ్గిపోయాయని పోలీసు వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా మావోయిస్టు మద్దతుదారుల నెట్‌వర్క్ బలహీనపడిందని, ఫలితంగా సరెండర్లు పెరిగాయని చెబుతున్నారు. జనవరి 8న దంతేవాడలో 63 మంది సరెండర్ కాగా అంతకుముందు రోజున రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1500 మంది లొంగిపోయారు. ఈ ఏడాది మార్చ్ 31 నాటికి నక్సలిజంను రూపుమాపాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న విషయం తెలిసిందే.

# రిజిస్ట్రేషన్ రుసుము ..తీగ లాగితే..కదులుతున్న డొంక...!




అవుతున్నాయి. ఎసిబి ఎస్పీ సింధుశర్మ నేతృత్వంలోని హైలెవెల్ కమిటీ ఈ వ్యవహారంపై అన్వేషణ ప్రారంభించింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ నిర్ణయించిన ప్రకారం... భూమి మార్కెట్(బుక్ వాల్యూ) విలువలో 7.5 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీ, మ్యుటేషన్‌కు ఎకరాకు రూ.2,500, పాస్ పుస్తకానికి రూ.350, హరితపన్నుగా రూ.50... ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సందర్భంగా చెల్లించాలి. మార్కెట్ విలువ ఆన్‌లైన్‌లో ముందుగానే నిర్ధారించి ఉంటుంది. సర్వే నంబరును ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే ఎంత చెల్లించాలనేది కంప్యూటర్ తెరపైన కనిపిస్తుంది. చెల్లింపుల్లో ఏ ఒక్క రూపాయి తక్కువైనా ఆ రిజిస్ట్రేషన్ ఆటోమేటిక్‌గా తిరస్కారానికి గురవుతుంది. కానీ, 4,800 లావాదేవీల్లో 1శాతం రుసుం మాత్రమే చెల్లించినా ఎక్కడా రిజిస్ట్రేషన్ రిజెక్ట్ అవలేదు. ధరణి/భూభారతి పోర్టల్‌లో ఉన్న బలహీన సాంకేతికత అక్రమ లావాదేవీలకు ఆస్కారం కల్పించిందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ధరణిని ప్రైవేటు సంస్థ నిర్వహించగా, ఇప్పుడు భూభారతి ఎన్ఐసీ చేతిలో ఉంది. ధరణి నుంచి భూభారతిగా మారిన తర్వాత కొనసాగిన లోపాలు, ప్రస్తుతం వెలుగు చూసిన ఈ-చలాన్ల సొమ్ము దారిమళ్లింపునకు అనుమతిచ్చిన సాఫ్ట్‌వేర్ బలహీనతలపై రెవెన్యూ శాఖ దృష్టి సారించింది. సీఎమ్మార్వో ప్రాజెక్టు డైరెక్టర్ మంద మకరందు వీటిపై ఎన్ఐసీ నిపుణులతో చర్చిస్తున్నట్లు సమాచారం. సాగు భూముల రిజిస్ట్రేషన్లకు అత్తెసరు ఛార్జీలు చెల్లించినా వాటిని ఆమోదించి డీడ్స్‌పై సంతకాలు చేసిన తహసీల్దార్ల పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్ సెంటర్‌లో చలానా చెల్లించి నిర్దిష్ట తేదీన తహసీల్దారు-సంయుక్త సబ్ రిజిస్ట్రార్ వద్దకు భూముల క్రయ, విక్రయదారులు, నలుగురు సాక్షులు కూడా వస్తారు. పాసుపుస్తకాలను, ఫొటోలను, సెల్ నంబర్లను పరిశీలించుకోవడం, రికార్డుల్లో ఉన్న వ్యక్తి, హాజరైన యజమాని ఒక్కరేనా అనేది తేల్చుకోవడం తహసీల్దారు బాధ్యత. దీంతోపాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలను ప్రభుత్వ నిబంధనల మేరకే చెల్లించారా అనేది కూడా తప్పనిసరిగా పరిశీలించడమనేది మరో ముఖ్యమైన విధి. ఈ విషయంలో ధరణి ఆపరేటర్ ముఖ్య సహాయకుడిగా పనిచేయాలి. కీలక బాధ్యతల విషయంలో తహసీల్దార్లు, ఆపరేటర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్ర అంశంగా రెవెన్యూ శాఖ భావిస్తోంది.

# సంక్రాంతితోనే ఉత్తరాయణం ప్రారంభం !



కాలగమనంలో మార్పును సూచించేదే సంక్రాంతి. చలి ముగిసిపోయి.. వెచ్చని అడుగులు పడుతున్నాయన్న సంకేతం ఇచ్చేదే సంక్రాంతి. సూర్యుడు దక్షిణాయంనం నుంచి ఉత్తరాయణంలోకి పయనించేది కూడా సంక్రాంతి నుంచే. మకర సంక్రాంతి రోజున సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. ఉత్తరాయణం పుణ్యకాలం మొదలవుతుంది. ఈ ఉత్తరాయణాన్ని దేవతలకు సంబంధించిన కాలంగా పరిగణిస్తారు. అందుకే ఈ కాలాన్ని ఆధ్యాత్మికంగా ఎంతో శుభప్రదంగా పరిగణిస్తారు. ఈరోజు నుంచి వివాహం, గృహప్రవేశం, నామకరణం, కొత్త వ్యాపారం వంటి ఇతర శుభ కార్యాలపై ఉన్న నిషేధం కూడా తొలగిపోతుంది. హిందువుల పండుగలు అన్నీ కానుగతిని బట్టి నిర్ణయించినవే. ఇందులో శాస్త్రీయతో పాటు, బలమైన సందేశం ఉంది. పండగల వైశిష్ట్యం అంతాఇంతా కాదు. ప్రతి పండగ వెనక పరమార్థం ఉంది. వాటిని ఆరించే విధంగా చేస్తున్నవే పండగలు. సంక్రాంతి పండగ తెలుగు వారికి పెద్ద పండగే అయినా...దేశంలోని పలు ప్రాంతాల్లో దీనిని పలు రకాలుగా జరుపు కుంటారు. తెలుగు పంచాంగం ప్రకారం మకర సంక్రాంతి పండుగని సూర్యుడు రాశి మార్పు ఉత్తరాయణం ప్రారంభానికి సూచికగా భావిస్తారు. ఇదే రోజున శ్రీమహావిష్ణువుకు అంకితం చేసిన షట్తిల ఏకాదశి అరుదైన కలయిక ఏర్పడుతోందని చెబుతున్నారు పండితులు. ఈ ప్రత్యేక యోగంలో చేసే పవిత్ర స్నానం, దానధర్మాలు, పూజలు మామూలు రోజులు చేసే పూజాఫలం కంటే అనేక రెట్లు ఎక్కువ పుణ్యాన్ని ఇస్తుందని నమ్ముతారు. షట్తిల ఏకాదశి ఉండటం వల్ల ఈరోజుకు మరింత విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో మకర సంక్రాంతి పండుగకి ప్రత్యేకమైన ప్రాముఖ్యత ఉంది. హిందువులు ఈ సంక్రాంతి పండుగని పెద్ద పండుగగా జరుపుకుంటారు. అంతే కాకుండా ఆధ్యాత్మిక శుద్ధి, నూతన శక్తికి సంబంధించిన పండుగగా పరిగణిస్తారు. ఈ పండుగ వేళ పవిత్ర స్నానాలు, దానధర్మాలు, పూజలు, సూర్యారాధన వంటి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కాబట్టి పవిత్రమైన సూర్య సంక్రమణం సమయంలో స్నానం చేయడం ఎంతో శుభప్రదం. ఈ పండుగ మూడు రోజులు ఎంత పని ఉన్నా ఎలా ఉన్నా స్నానం మాత్రం తప్పకుండా చేసి శుచిగా ఉండాలి. ముఖ్యంగా ఈ మూడు రోజులు తెల్లవారు జామున నిద్రలేచి సూర్యోదయం వేళ స్నానం చేసి సూర్య నమస్కారం చేస్తే ఎంతో పుణ్యప్రదం. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో ఆచరించే పూజలు, నోములు,బొమ్మల కొలువు ఎంతో ఆనందంతో పాటు సర్వ శుభాలను కలగజేస్తాయని నమ్మకం కలుగుతుంది. పంచభూతాలలో పరమాత్మను దర్శించగలిగి, జ్ఞానమనే చీకటి నుంచి వెలుగు మార్గాన పయనమే సంక్రాంతి సూర్యభగవానుడు మకర రాశిలోకి ప్రవేశించి ఉత్తరాయణం ప్రారంభిస్తాడు. అలాగే హిందూ సంప్రదాయం ప్రకారం మకర సంక్రాంతి రోజు చేసే దానధర్మాలు, పుణ్య కార్యాలు, పరిహారాలు ఏడాది పొడవునా సుఖశాంతులు, సిరిసంపదలు, శ్రేయస్సు కలిగిస్తాయని నమ్మకం. ఈ సంక్రాంతి పండుగ రోజు సాధారణంగా ఇరుగు పొరుగు వారికి పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు ఇస్తారు. సంక్రాంతి పండుగ, మకర సంక్రాంతి పండుగ అందమైన రంగవల్లులకు.. గొబ్బెమ్మలకు.. హరిదాసుల పాటలకు.. బసవన్నల ఆటలకు.. నువ్వుల మిఠాయిలకు.. గాలిపటాలు ఎగరేయడానికి ఇలా ఎన్నో సంబరాలకు ప్రసిద్ధి. ఈ సంక్రాంతి పండుగను పంటల పండుగ అని.. అలాగే మార్పు తీసుకొచ్చే పండుగ అని కూడా అంటారు. అలాగే ఈ పండుగలు అనేవి మన వర్తమాన, భవిష్యత్తులను గుర్తుచేస్తూ.. స్నేహంతో మలచుకోవాలి అనే విషయాలను గుర్తుచేస్తాయి. అంతే కాకుండా ఈ సంక్రాంతి పండుగ రోజున సూర్య భగవానుడిని నియమ నిష్టలతో భక్తి శ్రద్ధలతో పూజించి నైవేద్యాలు సమర్పించడం వల్ల ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడి ఆశీస్సులు పుష్కలంగా ఉంటాయని పండితులు చెబుతారు. వేకువజామున లేచి తలంటుకుని స్నానం చేసి సూర్యభగవానుడికి నమస్కరించి అర్ఘ్యం వదలాల్సి ఉంటుంది. అంటే ఈ పండుగ రోజుల్లో స్నానం చేయకపోతే కనుక 7 జన్మల పాటు రోగాల బారిన పడి నిర్ధనుడై జీవిస్తాడని శాస్త్రంలో చెప్పారు.

సూర్యదేవుడికి ఫలపుష్పాదులను సమర్పించి పూజిస్తారు. సంవత్సరంలో పన్నెండు సంక్రాంతులు వచ్చినా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే కాలం పుణ్యప్రదమని నమ్మకం. ధనుర్మాసంలో వానలు తగ్గి భూమి పొడిగా ఉంటుంది. ఆవుపేడ కలిపిన నీటిని చల్లి ముగ్గులు పెడితే కంటికి ఇంపుగా ఉండడమే కాకుండా పురుగులు, విష కీటకాలు ఇంట్లోకి రావు. సున్నంతో పెట్టిన ముగ్గులు, గడపలు, గొబ్బెమ్మలకు పెట్టిన పసుపు కుంకుమలు ఇంటికి శోభనివ్వడమే కాకుండా పసుపు సూక్ష్మజీవు లను నశింపజేస్తుంది. హరిదాసులు, నందీశ్వరుడినే నాట్యమాడించే గంగిరెద్దుల వారు ఇచ్చినది తీసుకుని సంతృప్తిగా వెళ్లడం దానగుణాన్ని పెంపొందిస్తుంది. క్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, సన్నిహితుల కోసం సంప్రదాయ వంటలు తయారు చేస్తారు. సాధారణంగా సంక్రాంతి నైవేద్యాలలో కట్టుపొంగలి, చక్కెర పొంగలి ఉంటాయి. పొంగలిలో ఉపయోగించే పెసరపప్పు, మిరియాలు, జీలకర్ర, అల్లం శ్లేష్మాన్ని పోగొట్టి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. నెయ్యి శరీరానికి పుష్టిని, ఎముకలకు బలాన్ని ఇస్తుంది. తెల్లవారు జామునే లేవడం, స్నానం, భగవంతుని ప్రార్థించడం, పూజ, నైవేద్యాలు, ఆరోగ్య కారకం. పార్వతి దేవి శివుని భక్తగా పొందడానికి తపస్సు చేసి పూజించి.. పెసరపప్పు, బియ్యం, నెయ్యి కలిపి వండిన పొంగలిని వివేచన చేసినట్లు పురాణ కథనం.

## పల్లెల్లో అంతటా సంక్రాంతి శోభ



అమరావతి: తెలుగు రాష్ట్రాల్లోని పల్లెలు సంక్రాంతి శోభతో కళకళలాడుతున్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ పండుగ అనగానే మన మదిలో మెదిలేది భోగిమంటలు, గంగిరెద్దులు, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ పందేలు, కొత్తదుస్తులు, పిండి వంటలేనని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో ఏపీ అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోందన్న సంగతిని వేరే ప్రస్తావించవలసిన అవసరం లేనేలేదన్నారు. శాంతి, సామరస్యం ఉన్నచోట రోజూ పండుగే. ఇలాంటి తరుణంలో జరుగుతున్న ఈ సంక్రాంతితో ప్రతి ఇల్లూ సౌభాగ్యంతో విలసిల్లాలని కోరుకుంటున్నాను. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించి ఉత్తరాయణ పుణ్యాన్ని ప్రసాదించే ఈ పండుగ తెలుగువారందరికీ సర్వైశ్వర్యం ప్రసాదించాలని దేవుడిని కోరుకుంటున్నానని పవన్ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సంక్రాంతి సౌభాగ్యాన్ని అందించాలని సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పవన్ ఆకాంక్షించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పల్లెలు పండుగ శోభతో కళకళలాడుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం రాకతో ఆంధ్రప్రదేశ్ అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోందన్నారు. శాంతి, సామరస్యం ఉన్నచోట రోజూ పండుగే అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఇటువంటి తరుణంలో జరుగుతున్న ఈ సంక్రాంతి పండుగ నాడు ప్రతి ఇల్లూ సౌభాగ్యంతో విలసిల్లాలని పవన్ కోరారు.

## ఎపిలో పలు ప్రాంతాల్లో కోడి పందాలు




విజయవాడ:తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా ఏపీలోని పలు ప్రాంతాల్లో కోడిపందేలు జోరుగా మొదలయ్యాయి. బరుల వద్ద పందెం రాయుళ్లు, వీక్షకులతో కోలాహలం నెలకొంది. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం, కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో బరుల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి తదితరులు తిలకించారు. బరుల వద్ద పందెం రాయుళు ్ల, వీక్షకులతో కోలాహలం నెలకొంది. సంప్రదాయంగా భావించే ఈ కార్యక్రమాలు ముఖ్యంగా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో కోడి పందేలకు బరులు ముస్తాబయ్యాయి. ఈ పందేలను చూసేందుకు దూరప్రాంతాల ప్రజలు సైతం పెద్దఎత్తున తరలివస్తున్నారు. బరుల్లో ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు నిర్వాహకులు. అయితే.. గతంలో లాగానే ఈసారీ కోట్ల రూపాయల్లో పందేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కోనసీమ జిల్లా అమలాపురంలో కోడిపందేలు, గుండాటలు ప్రారంభమయ్యాయి. ప్రతి గ్రామంలోనూ కోడిపందేలు, గుండాటలు ఏర్పాటయ్యాయి. 'మూడు బరులు.. ఆరు బోర్డులు' అన్నట్లు నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 150కిపైగా కోడిపందేల బరులు ముస్తాబయ్యాయి. గుడివాడ నియోజకవర్గంలో సంక్రాంతి కోడిపందేలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. కోడిపందేలు, కోత ముక్కలో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్న పరిస్థితి. బరులు జాతరను తలపిస్తున్నాయి. హోరాహోరీగా కోడి పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలను చూసేందుకు జనం పెద్దఎత్తున తరలివచ్చారు. గుడివాడ రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో బరులను ఏర్పాటుచేశారు. ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో కోడి పందేలు జోరుగా మొదలయ్యాయి. కైకలూరు మండలం భుజబలపట్నంలో ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటుచేసి మరీ కోడిపందేలను నిర్వహిస్తున్నారు. ఈ పందేలను ఎమ్మెల్సీ జయమాంగళ వెంకటరమణ తిలకించారు.

కాకినాడ జిల్లా పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో కోడిపందేలు ప్రారంభమయ్యాయి. బరుల్లో భారీ లైవ్ స్క్రీన్లను ఏర్పాటుచేయడంతో పాటు నాయకులు, ప్రజలు కూర్చుని చూసేందుకు బరిచుట్టూ స్టేజ్‌ను నిర్వాహకులు ఏర్పాటుచేశారు.

## పడిపోయిన టమోటా ధరలు

### మదనపల్లె మార్కెట్‌లో కిలో 25కే విక్రయం



మదనపల్లె:మదనపల్లెలో కిలో టమోటా రూ.25కు పడిపోయాయి. మంగళ వారం మదనపల్లె వ్యవసాయ మార్కెట్‌కు 90 మెట్రిక్ టన్నుల టమోటా మాత్రమే వచ్చాయి. వాటిలో పది కిలోల మొదటి రకం టమోటాలు రూ.250, రెండో రకం రూ.230, మూడో రకం రూ.200లతో వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేశారని మార్కెట్ సెక్రటరీ జగదీష్ తెలిపారు. పదిరోజుల క్రితం కిలో టమోట రూ.50 పలుకగా, వారం రోజులుగా రేట్లు రోజు రోజుకు తగ్గు ముఖం పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు పతనం కావడంతో కనీసం పంటలు వేసేందుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా రావడం లేదని, ధరలు ఇలాగే కొనసాగితే వ్యవసాయం చేయకుండా మానేయడమే మేలని రైతులు అంటున్నారు. మార్కెట్ యార్డులో ధరలు పతనం కాగా బహిరంగ మార్కెట్‌లో మాత్రం టమోటా ధరలు అకాశాన్నంటు తుండడంతో వినియోగదారులు బేంబేలెత్తుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మొదటి రకం కిలో టమోటా రూ.50 పలుకుతుండడం గమనార్హం. మరికొన్ని చోట్ల ఈ ధర మరింత ఎక్కువగా తీసుకుంటున్నారు. ఈ ధరలవల్ల పంట పండించే రైతు తీవ్రంగా నష్టపోతుండగా వ్యాపారులు మాత్రం అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి రైతులకు గిట్టుబాటు బాట ధర కల్పించేలా చర్యలు తీసుకోవాల్సి కోరుతున్నారు.

వేగుచుక్క

# అభివృద్ధి కోసం "ముగ్గులతో నిరసన".







**- బిచ్కుందలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే వినూత్న ఉద్యమం.**

**వేగుచుక్క న్యూస్: బిచ్కుంద**

మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారి అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేయడం వల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు ఆ రోడ్డు పనులు పూర్తికాకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా మారిందని జుక్కల్ మాజీ శాసన సభ్యులు హన్మంత్ షిండే తీవ్రంగా విమర్శించారు. సంక్రాంతి పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం బిచ్కుంద పట్టణ కేంద్రంలోని ప్రధాన రహదారిపై ప్రజల దృష్టిని ఆకర్షించేలా ముగ్గులతో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధిని నిలిపివేసిన ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే మాట్లాడుతూ, బిచ్కుంద మెయిన్ రోడ్డు పట్టణానికి హృదయం లాంటిదనీ, అలాంటి రోడ్డు పనులను మధ్యలో ఆపేసి రెండేళ్లు గడిచినా పూర్తి చేయకపోవడం ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యాన్ని చూపిస్తోందన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో అభివృద్ధి అన్న మాటే కాంగ్రెస్ ఎమ్మెల్యేకి తెలియదా అనే అనుమానం కలుగుతోంది" అని అన్నారు. అభివృద్ధి పనులు పూర్తి చేయక ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఇక సహించబోమని హెచ్చరించారు. తక్షణమే బిచ్కుంద మెయిన్ రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి మరింత ఉధృతమైన ఉద్యమాలకు సిద్ధమని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వైఫల్యానికి వ్యతిరేకంగా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.



## వీధి కుక్కల హతం.. ఐదుగురు సర్పంచులపై కేసు.

**- కామారెడ్డి జిల్లాలో ఘటన.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:**

వందలాది వీధి కుక్కలను చంపి పాతి పెట్టారంటూ ఐదుగురు సర్పంచులపై జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో సదరు సర్పంచులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఈ అంశం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మాచారెడ్డి పిఎస్ పరిధిలోని పాల్వంచ మండలంలో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పాల్వంచ మండలంలోని భవానిపేట, పాల్వంచ, ఫరీదుపేట, వాడి, బండరామేశ్వర్ పల్లి గ్రామాల్లో సుమారు 600 వీధి కుక్కలకు ఇంజక్షన్లు, విష గుళికలు ఇచ్చి చంపి పాతి పెట్టారని పలువురు జంతు ప్రేమికులు, ఎన్జీవోస్ ఈ నెల 12న మాచారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెలలో జరిగిన సర్పంచ్ ఎన్నికలలో వాగ్దానాలను అమలు చేయడానికి సర్పంచులు వీధి కుక్కలను చంపేశారని జంతు ప్రేమికులు ఆరోపిస్తున్నారు. జంతు ప్రేమికుల ఫిర్యాదు మేరకు చంపేసి, పూడ్చి పెట్టిన మృతదేహాలను జేసీబీ సహాయంతో వెలికితీసిన వెటర్నరీ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసుల విచారణ అనంతరం ఐదుగురు సర్పంచులపై వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ప్రజల సౌకర్యార్థం, హాని కలగకుండా ఉండేందుకు చేసిన పని ఇప్పుడు సర్పంచుల మెడకు చుట్టుకుందన్న వాదన వినిపిస్తోంది. ఐదుగురు సర్పంచులపై కేసు నమోదు కావడంతో మిగతా సర్పంచులు ఆందోళనకు గురవుతున్నారు.

# పిఓడబ్ల్యు ఆధ్వర్యంలో "ముగ్గుల పోటీలు".







**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

సంక్రాంతి పండగ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం, తెలంగాణ తల్లి సమైక్య ఆధ్వర్యంలో, జిల్లా కేంద్రం లోని కోటగల్లి, భగత్ సింగ్ విగ్రహం వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, జిల్లా అధ్యక్షురాలు గోదావరి, తెలంగాణ తల్లి సమైక్య ఆర్పీ దాసరి స్వప్న లు మాట్లాడారు. ఆటలు శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. మానవులు అంతరిక్షంలోని గ్రహాల పైకి వెళుతున్న మనుషులలో స్త్రీ, పురుష వివక్ష నేటికి కొనసాగడం అమానుషం అన్నారు. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన వారిని మోడీ సర్కార్ సన్మానించడమే కాకుండా కేసుల నుండితప్పించడం దుర్మార్గం అని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి దోషలను పట్ల కఠినంగా వ్యవహరించాలని, అన్నారు. ఆటలను ఆడిపించి, వాటిలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు నర్సక్క, అనిత, గీత, తెలంగాణ తల్లి సమైక్య ఓబి జయ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మరోమారు రాజ్యసభకు నో దిగ్విజయ్‌కు పార్టీ పరోక్ష సూచన

భోపాల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మూడోసారి రాజ్యసభకు పోటీ చేయడం లేదని చెప్పారు. ఏప్రిల్ 2026లో ఆయన పదవీకాలం ముగియనున్నది. అయితే మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ శాఖ అధ్యక్షుడు ప్రదీప్ అహిర్వార్ నుంచి అభ్యర్థన రావడం వల్ల దిగ్విజయ్ తన రాజ్యసభ సీటును త్యాగం చేయబోతున్నట్లు తెలుస్తున్నది. షెడ్యూల్ కులాలకు చెందిన నేతను ఎగువ సభకు పంపాలని భావిస్తున్నట్లు ప్రదీప్ తెలిపారు. జనవరి 13వ తేదీన ప్రదీన్ ఓ లేఖ రాశారు. సామాజిక న్యాయం కోసం మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు కాంగ్రెస్ సీటుపై ఓ దళితుడిని పంపాలని భావిస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో ఎస్సీలు 17 శాతం ఉన్నట్లు తెలిపారు. రాజ్యసభను వదిలేది నా చేతుల్లో లేదని, కానీ తన రాజ్యసభ సీటును ఖాళీ చేస్తున్నానని దిగ్విజయ్ ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2014 నుంచి ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. మధ్యప్రదేశ్ సీఎంగా యాన రెండు సార్లు బాధ్యతలు నిర్వర్తించారు.

1993 నుంచి 2003 వరకు ఆయన సీఎంగా చేశారు. 2003లో ఓడి పోయిన తర్వాత రాజకీయాలకు దిగ్విజయ్ స్వస్తి పలికారు. పదేళ్ల తర్వాత ఆయన రాజ్యసభలోకి ఎంట్రీ ఇచ్చారు.

# జేసీఐ ఆధ్వర్యంలో "సంక్రాంతి" సంబరాలు.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఇందూర్ ఆద్వర్యంలో బుధవారం నగరంలోని ఇంద్రాపూర్ కాలనీలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం కాలనీకి చెందిన పిల్లలకు గాలిపటాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేసీఐ ఇందూర్ అధ్యక్ష కార్యదర్శులు జైపాల్ కాలె, తిరునగరి మనస్విని, జోన్ ఆఫీసర్ జిల్కర్ నయన్, ప్రోగ్రామ్ చైర్మెన్ కోడూరు శ్రీనివాస్, జేఏసి అలుమ్ని క్లబ్ రీజియన్ చైర్మెన్ జిల్కర్ లావణ్య, పూర్వాద్యక్షులు చింతల గంగాదాస్, తిరునగరి శ్రీహరి, జేసీఐ ప్రతినిధులు నిపుణ్, సునీత, వెన్నెల, మృణాళిని, అక్షిత, బి. నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.




## అమెరికాలో చేరేది లేదు గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్

కోపెన్‌హాగెన్: అమెరికాలో స్వాధీనంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులపై గ్రీన్‌ల్యాండ్ స్పందించింది. తాము అమెరికాలో చేరబోమని, డెన్మార్క్ యూనియన్‌లోనే ఉంటామని గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ పేర్కొన్నారు. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, తమ దేశాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు అమెరికా బెదిరింపులకు దిగుతోందని మండిపడ్డారు. అమెరికానా, డెన్మార్కా ఎంపిక చేసుకోమంటే.. తాము డెన్మార్క్‌నే ఎంపిక చేసుకుంటామని స్పష్టం చేశారు. వాస్తవానికి గ్రీన్‌ల్యాండ్ డెన్మార్క్‌లో భాగమని జెన్స్ ఫ్రెడరిక్ పేర్కొన్నారు. కోపెన్‌హాగన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. డానిష్ ప్రధాని మెట్ ఫ్రెడరిక్‌సన్ కూడా ఈ సమావేశంలో పాల్గన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ కార్యదర్శి మార్క్ రూబియోలతో డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ విదేశాంగ మంత్రులు బుధవారం జరగనున్న ఉన్నత స్థాయి చర్చలకు ముందు ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. గ్రీన్‌ల్యాండ్‌పై బెదిరింపులను తగ్గించడం, దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించడం ఈ చర్చల లక్ష్యమని పేర్కొన్నారు. ట్రంప్ బెదిరింపులు ,ఆర్థిక ఒత్తిడి లేదా సైన్యాన్ని ప్రయోగించడం ద్వారా గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ట్రంప్ యత్నిస్తున్న సంగతి తెలిసిందే. జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ వ్యాఖ్యలపై ట్రంప్ మరింత బెదిరింపులకు దిగారు. తరువాత వారికి పెద్ద సమస్యను సృష్టించగలదని హెచ్చరించారు. అది వాళ్ల సమస్యఅని అన్నారు. వారి సమస్యతో తాను విభేదిస్తున్నానని అన్నారు.

# ఐ-ప్యాక్ సంస్థపై ఇడి దాడులు

**హైకోర్టులో టిఎంసి పిటిషన్ తిరస్కరణ**


కోల్‌కతా ఐ-ప్యాక్ సంస్థపై ఇటీవల జరిపిన దాడుల్లో తమ పార్టీ ఫైళ్లు, ఎన్నికలకు సంబంధించిన డేటాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టరేట్ సీజ్ చేసిందంటూ తృణమూల్ కాంగ్రెస్ వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు బుధవారం నాడు డిస్పోజ్ చేసింది. సుప్రీంకోర్టులో ఇదే తరహా పిటిషన్ వేసినట్టు ఈడీ చెప్పడంతో ఆ సంస్థ వేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది. ఈడీ వేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం గురువారం నాడు విచారణ జరుపనుంది. టీఎంసీకి సంబంధించిన ఎలాంటి డేటాను తాము సీజ్ చేయలేదని కోల్‌కతా హైకోర్టులో విచారణ సందర్భంగా ఈడీ తెలిపింది. కస్టడీలోకి తీసుకోని సామగ్రిని సురక్షితంగా ఉంచాలనడం ఏమిటని ప్రశ్నించింది. ఇది డేటా భద్రతకు సంబంధించిన అంశమే అయితే ఇందుకు సంబంధించిన విజ్ఞప్తిని తాము కట్టుబడి ఉంటామని, ఈడీ ఎలాంటి డేటాను స్వాధీనం చేసుకోలేదని, ఇందుకు భిన్నంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీనే ఆ డేటా తీసుకువెళ్లారని తెలిపింది. తమ తనిఖీలతో తృణమూల్ కాంగ్రెస్‌కు అసలు సంబంధమే లేదని వివరించింది. కాగా, ఎన్నికలకు సంబంధించిన తమ పార్టీ డేటాను ఈడీ సీజ్ చేసినందున ఆ డేటాకు భద్రత కల్పించాలని కోర్టును టీఎంసీ కోరింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహకర్త, ఐ-ప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ నివాసంపై ఈడీ ఇటీవల దాడులు జరిపింది. దీంతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించిన పేపర్లు, పార్టీ ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన సమాచారం కలిగిన కంప్యూటర్ హార్డ్ డ్రైవ్‌లు, కీలకమైన డిజిటల్ మెటీరియల్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఈడీ ప్రయత్నించినట్టు ఆమె ఆరోపించారు. మమతా బెనర్జీ చర్యను బీజేపీ తీవ్రంగా ఖండించింది. లీగల్ ఇన్వెస్టిగేషన్‌ను రాజకీయ అంశంగా చేసుకుని రాజ్యాంగ సంస్థలు, చట్టబద్ధ పాలనను బలహీన పరిచేందుకు సీఎం ప్రయత్నించినట్టు ఆరోపించింది. దర్యాప్తు సంస్థల వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ఎలాంటి చర్యలనైనా తాము తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించింది.

## మోడీ సంక్రాంతి, మాఘబిహు శుభాకాంక్షలు

న్యూఢిల్లీ:ప్రధాని మోడీ ప్రజలకు మకరసంక్రాంతి, మాఘ బిహు మరియు పొంగల్ శుభాకాంక్షలు తెలిపారు. మకర సంక్రాంతి శుభ సందర్భంగా శు భాకాంక్షలు తెలుపుతూ.. భారతీయ సంస్కృతి -సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే నువ్వులు, బెల్లం తీపితో నిండిన ఈ పండుగ ప్రతి కుటుంబంలో ఆనందం,శ్రేయస్సు, విజయం నింపాలని కోరారు. సూర్యుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆయన ప్రార్థించారు. అస్సాంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు నేడు మాఘ బిహు పండుగను జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పొంగల్ పర్వదినం సందర్భంగా తమిళనాడు ప్రజలకు కూడా శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ పండగ రైతులు, వారి కుటుంబాల జీవితాల్లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. ఈ పండగ మనల్ని పోషించే వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, తద్వారా మన సమాజాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజలు ఆత్మవిశ్వాసం, ఆశావాదాన్ని కలిగివుండాలని పేర్కొన్నారు. ఈసంవత్సరం ప్రజలందరికీ శ్రేయస్సు, సానుకూలత మరియు మంచి ఆరోగ్యం కలిగి ఉండాలని తెలిపారు.

# మెగా ఛాన్స్





'ఈ రోజుల్లో' అనే చిన్న సినిమాతో దర్శకుడిగా పరిచయమైన మారుతి.. వెంకటేష్, నాగ చైతన్య, నాని, శర్వానంద్, సాయి ధరమ్ తేజ్ వంటి మీడియం రేంజ్ మార్కెట్ ఉన్న హీరోలతో వర్క్ చేశారు. ఇప్పుడు ఏకంగా ప్రభాస్ లాంటి పాన్ ఇండియా స్టార్ తోనే సినిమా చేసి స్టార్ లీగ్ లో ఎంటరయ్యారు. దీని తర్వాత మారుతీ సినిమా ఏంటనేది ఇంకా క్లారిటీ రాలేదు. అయితే ఆయన మెగాస్టార్ చిరంజీవితో వర్క్ చేయాలని ఆశ పడుతున్నారు.

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కించిన 'ది రాజాసాబ్' సినిమా సంక్రాంతి కానుకగా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మిక్స్ టాక్ తెచ్చుకున్నప్పటికీ, రిలీజైన 4 రోజుల్లో 201 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లను సొంతం చేసుకోగలిగింది. ఈ నేపథ్యంలో దర్శకుడు మారుతి ఓ ఇంటర్వ్యూలో తన ఆనందాన్ని పంచుకున్నారు. 'రాజా సాబ్' సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ దక్కుతోందని, సంక్రాంతి హాలీడేస్ బిగిన్ కాకముందే ఈ సినిమా రూ.200 కోట్ల మార్క్ టచ్ చేయడం హ్యాపీగా ఉందని ఆయన అన్నారు.

చిరంజీవితో త్వరలో ఓ సినిమా చేస్తానని ఓ ప్రశ్నకు సమాధానంగా మారుతి చెప్పారు. తాను మెగా అభిమానిని మరోసారి గుర్తు చేశారు. "ప్రస్తుతం 'రాజా సాబ్' సినిమానే నా ఆలోచనల్లో ఉంది. చిరంజీవితో సినిమా చేసే అవకాశం వస్తే, నా లైఫ్ సర్కిల్ ఫుల్ అయినట్లు భావిస్తా. ఆయన అభిమానిని నేను" అని మారుతి అన్నారు. మారుతి స్టేట్మెంట్ తో చిరుతో సినిమా చేయబోతున్నారనే చర్చలు ఊపందుకున్నాయి. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇప్పట్లో ఈ కాంబినేషన్ సాధ్యం అవుతుందా? లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

'మన శంకర వరప్రసాద్ గారు' మూవీతో హిట్టు కొట్టిన చిరంజీవి.. శ్రీకాంత్ ఓదెల, బాబి కొల్లి సినిమాలు లైన్ లో పెట్టారు. ముందుగా శ్రీకాంత్ ఓదెల సినిమా, ఆ తర్వాత బాబి 'మెగా 158' సినిమా ఉంటుందని టాక్ నడుస్తోంది. ఈ రెండు సినిమాల ఫలితాలపై మెగాస్టార్ తదుపరి సినిమాల లైనప్ ఉంటుంది. అయితే మారుతి ఇప్పటికే చిరుకి ఓ కథ చెప్పి ఒప్పించినట్లుగా తెలుస్తోంది. ఆ మధ్య మారుతి ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు.

# ఎల్లమ్మ అప్డేట్



టాలీవుడ్ లో ఎన్నో నెలలుగా వార్తలో ఉన్న క్రేజీ ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'. 'బలగం' వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత డైరెక్టర్ కమ్ యాక్టర్ వేణు యెల్దండి తలపెట్టిన చిత్రమిది. ఎప్పుడో సెట్స్ మీదకు వెళ్లాల్సిన ఈ సినిమా.. వివిధ కారణాలతో లేట్ అవుతూ వచ్చింది. ఈ గ్యాప్ లో వేణు కథ చాలామంది హీరో హీరోయిన్ల దగ్గర తిరిగింది. కానీ హీరో హీరోయిన్లుగా ఎవరు నటిస్తున్నారు? ఎప్పుడు షూటింగ్ స్టార్ట్ చేస్తారు? వంటి విషయాలపై క్లారిటీ లేకుండా పోయింది. అయితే ఎట్టకేలకు ఈ సినిమా అప్డేట్ వచ్చేసింది. 'బలగం' సినిమాతో దర్శకుడిగా పరిచయమైన వేణు యెల్దండి.. తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. తెలంగాణ పల్లెటూరి సంస్కృతిని, అనుబంధాలను వెండితెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. ఆ సినిమా కమర్షియల్ సక్సెస్‌తో పాటు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఎన్నో అవార్డులను కైవసం చేసుకుంది. దీంతో వేణు రెండో సినిమాపై అందరిలో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో 'ఎల్లమ్మ' అనే సినిమా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే మూడేళ్లు కావొస్తున్నా ఈ చిత్రం సెట్స్ మీదకు వెళ్లలేదు. ఈ క్రమంలో నటీనటుల గురించి సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వినిపించాయి. వాటన్నిటికీ ఫుల్ స్టాప్ పడుతూ, తాజాగా దర్శకుడు వేణు అభిమానులకు తీపి కబురు అందించారు. "బలగం' సినిమాని మీరందరూ ఎంతగానో ఆదరించారు.. ఆశీర్వదించారు. ఈ సినిమా నాకు ఎంతో ఇచ్చింది. జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాలను అందించారు. అందరికీ మరొక్కసారి ధ్యంక్యూ సో మచ్. నా రెండో సినిమా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ లో త్వరలోనే మొదలు కాబోతోంది. ఆ సినిమాకి సంబంధించిన వివరాలను ఒక గ్లింప్స్ ద్వారా చూపించాలని అనుకుంటున్నాను. సంక్రాంతికి ఆ గ్లింప్స్ మీ ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని కూడా ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని వేణు అన్నారు. ఎల్లమ్మ' సినిమాలో మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటించనున్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. తెలంగాణ గ్రామీణ నేపథ్యం ఈ చిత్రం ఉండబోతోందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# గట్టిగా దొరికేశాను



మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబోలో వచ్చిన 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమా భారీ విజయం సాధించింది. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన థంక్యూ మీట్‌లో, దర్శకుడు అనిల్ రావిపూడి చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని, సినిమా కథను ఎంత వేగంగా రాశారో వివరించారు. ప్రతి సీన్‌కు చిరంజీవి ఇన్స్పిరేషన్ అని తెలిపారు.

అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. "ఈ సంక్రాంతిని కూడా నాకు ఇంత మెమొరబుల్ గా చేసిన ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులందరికీ థంక్యూ సో మచ్. నేను మాటల్లో చెప్పలేను. మళ్లీ మళ్లీ ఇలాంటి మంచి సినిమాలు తీసి మీకు ఆనందాన్ని ఇచ్చి, దాని ద్వారా కృతజ్ఞతలు తెలియజేసుకుంటాను. అంతకుమించి నేనేమీ చేయలేను. ఇలాంటి అవకాశం ఇచ్చి, మెగా హిట్ ఇచ్చిన మెగాస్టార్ చిరంజీవికి థ్యంక్స్. నేను స్క్రిప్ట్ రాయడానికి రెండు నుంచి మూడు నెలల టైమ్ పడుతుంది. డైలాగ్స్ తో కలిపి మూడున్నర నెలలో కథ రెడీ చేస్తాను. షాకింగ్ విషయం ఏంటంటే, 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమా కథని ఫస్టాఫ్ 15 రోజులు, సెకండాఫ్ 10 రోజుల్లో పూర్తి చేశాను. అంటే 25 రోజుల్లో స్క్రిప్ట్ పూర్తి చేశాను. నా కెరీర్ లో చాలా ఫాస్ట్ గా ఫినిష్ చేసిన స్క్రిప్ట్ ఇది. దానికి కారణం చిరంజీవి" అని అన్నారు.

'మీడియా మిత్రులు అందరికీ ధన్యవాదాలు. ప్రతి మీడియా సోదరుడు నాకు ఎంతగానో ప్రోత్సహించారు. వాళ్ళ పాజిటివ్ ఎనర్జీలను మర్చిపోలేను. అందరికీ పేరుపేరునా థ్యంక్స్. సోషల్ మీడియాలో యూట్యూబ్ లో గత 15 రోజులుగా జరిగిన విధ్వంసం మామూలుది కాదు. దొరుకుతాడా? దొరకడా? అని. గట్టిగా దొరికేసాను.. ప్రేక్షకులకు గట్టిగా దొరికేశాను. టికెట్ పెట్టి చిరంజీవిని మేము ఇలా చూడాలి ..ఇలా సెలబ్రేట్ చేసుకోవాలి అని చూస్తున్న ప్రేక్షకులందరికీ గట్టిగా దొరికాను. మీమ్స్ ఫ్రెండ్స్ అందరూ.. ఏసుకునేవాళ్లు ఏసుకోండి. పొగిడేవాళ్లు పొగుడుకోండి. నేను మాత్రం మీమ్స్ చూసి నవ్వుకుంటాను.. ఎంజాయ్ చేస్తాను" అని అనిల్ నవ్వుతూ అన్నారు.



# యాక్షన్ సీక్వెన్స్

మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ' పెద్ది ' ప్రస్తుతం టాలీవుడ్‌లో అత్యంత హైప్ క్రియేట్ చేస్తున్న ప్రాజెక్ట్‌గా నిలిచింది. 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రామ్ చరణ్ సరసన బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ కథనాయికగా నటిస్తుండగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ గ్రామీణ నేపథ్య స్పోర్ట్స్ రివేంజ్ డ్రామాకు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, 'చికిరి చికిరి' పాట సినిమాపై అంచనాలను భారీగా పెంచాయి. ఫోక్ టచ్‌తో కూడిన ఎనర్జిటిక్ రిథమ్, రామ్ చరణ్ మాస్ లుక్, బాడీ లాంగ్వేజ్ ఈ పాటను చార్ట్‌బస్టర్‌గా మార్చాయి. సోషల్ మీడియాలో ఈ సాంగ్ రీల్స్, షార్ట్ వీడియోల రూపంలో విపరీతంగా వైరల్ అవుతూ 'పెద్ది'పై నమ్మకాన్ని మరింత బలపరిచింది. ఇదిలా ఉండగా, సినిమాను చెప్పిన తేదీకే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో చిత్ర బృందం నిర్విరామంగా శ్రమిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' క్లైమాక్స్ సన్నివేశాల చిత్రీకరణను మేకర్స్ ప్రారంభించారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో రామ్ చరణ్‌తో పాటు కీలక తారాగణంపై యాక్షన్ సన్నివేశాలను అత్యంత శక్తివంతంగా తెరకెక్కిస్తున్నారు. ఆటలతో ముడిపడిన ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో రామ్ చరణ్ ఆట కూలీ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఫస్ట్ హాఫ్ కట్ సిద్ధమైందని, సెకండ్ హాఫ్‌కు సంబంధించిన నిర్మాణానంతర పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని తెలుస్తోంది. ఈ నెలాఖరు కల్లా టాకీ పార్ట్ మొత్తాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా యూనిట్ ముందుకు సాగుతోంది. అయితే వాటికి మేకర్స్ స్పష్టమైన క్లారిటీ ఇచ్చారు. ఏఆర్ రెహమాన్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ట్వీట్‌లో ఈ చిత్రాన్ని మార్చి 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మరోసారి అధికారికంగా ప్రకటించారు. దీంతో సినిమా వాయిదా పడుతుందన్న ప్రచారానికి పూర్తిగా చెక్ పడింది. 'గేమ్ ఛేంజర్' వంటి భారీ అంచనాల మధ్య వచ్చిన సినిమా నిరాశపరిచిన నేపథ్యంలో రామ్ చరణ్ నుంచి వస్తున్న తదుపరి చిత్రం కావడంతో 'పెద్ది'పై అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి. కథ, స్కేల్, ఎమోషన్, సంగీతం అన్నీ కలిసి ఈ సినిమాను రామ్ చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిపే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



# టోకరా...

ప్రముఖ సినీ దర్శకుడు తేజ కుమారుడు, వ్యాపారవేత్త అమితవ్ తేజ దారుణంగా మోసపోయారు. ట్రేడింగ్ ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ జంట ఆయన నుంచి రూ. 63 లక్షలు కాజేసింది. మోసపోయానని గ్రహించిన అమితవ్ జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఘటన వెలుగుచూసింది. వ్యాపార పనుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న అమితవ్ తేజకు 2025 ఏప్రిల్‌లో మోతీనగర్‌కు చెందిన యార్లగడ్డ అనూష, కొండపనేని ప్రణీత్ దంపతులతో పరిచయం ఏర్పడింది. తాము ట్రేడింగ్ నిపుణులమని, పెట్టుబడి పెడితే అనూహ్య లాభాలు వస్తాయని వారు నమ్మబలికారు. ఒకవేళ నష్టాలు వస్తే, తాము నివసిస్తున్న అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌ను రాసిస్తామని హామీ ఇచ్చారు. వారి మాటలను నిజమని నమ్మిన అమితవ్ పెట్టుబడి పెట్టేందుకు అంగీకరించారు. ఈ క్రమంలో వారంలోనే రూ. 9 లక్షల లాభం వచ్చిందంటూ అమితవ్‌కు కొన్ని నకిలీ పత్రాలను చూపించారు. ఇది నిజమని నమ్మిన అమితవ్ విడతల వారీగా మొత్తం రూ. 63 లక్షలను ఆ దంపతులకు అందజేశారు. అయితే, నెలలు గడుస్తున్నా అటు లాభాలు కానీ, ఇటు అసలు కానీ తిరిగి రాకపోవడంతో ఆయనకు అనుమానం వచ్చింది. వారిని నిలదీయగా ముఖం చాటేశారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన అమితవ్, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు

# కచ్చితంగా నవ్వుతారు



శర్వానంద్ హీరోగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ' నారీ నారీ నడుమ మురారి ' సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'సామజవరగమన'తో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న రామ్ అబ్బరాజు దర్శకత్వం వ హించిన ఈ చిత్రంలో సంయుక్త మీనన్ , సాక్షి వైద్య హీరోయిన్లుగా నటించారు. శ్రీవిష్ణు స్పెషల్ క్యామియోలో కనిపించనుండటం సినిమాపై ఆసక్తి ని పెంచింది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మించగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు. అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకున్న 'నారీ నారీ నడుమ మురారి' జనవరి 14న సాయంత్రం ప్రీమియర్ షోలతో థియేటర్లలోకి రానుంది. సంక్రాంతి ఫెస్టి వల్ సీజన్‌కు తగ్గట్టు ఫుల్ ఫన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందినట్లు చిత్ర బృందం చెబుతోంది.

తాజాగా ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా నిర్వహించిన ఓ ఈవెంట్‌లో సీనియర్ నటుడు నరేష్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. తన స్పీచ్‌లో నరేష్ ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడుతూ, ఈ సినిమా తన కెరీర్‌లోనే ప్రత్యేకమైన మైలురాయిగా నిలుస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. "సామజవరగమనతో నరేష్ వర్షన్ 2.0 మొదలైంది. అక్కడి నుంచి మళ్లీ కొత్తగా స్టార్ట్ అయినట్టే. ఇప్పుడు 'నారీ నారీ నడుమ మురారి' నరేష్ వర్షన్ 3.0 కాకపోతే నేను సినిమాలు మానేస్తాను" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఈవెంట్‌కు వచ్చిన అభిమానులను ఆకట్టుకున్నాయి. ఇక సినిమాపై తనకు ఉన్న నమ్మకాన్ని మరింత బలంగా చెబుతూ, "మీడియాతోనో, జనాలతోనో నేను ఎప్పుడూ ఛాలెంజ్‌లు పెట్టను. కానీ ఈ సినిమాపై నాకు గన్ షాట్ నమ్మకం ఉంది. ఇది నా కెరీర్‌లో బెస్ట్ రోల్స్‌లో ఒకటి కాదూ ది బెస్ట్ రోల్ అని చెప్పగలను" అంటూ నరేష్ స్పష్టం చేశారు.